# 6

## చిత్తుకాగితాలు - చెత్తపరకలు

తెల్లవారితే గాంధీ జయంతి. విద్యాలయానికి సెలవు వుంటుందని తెలుసు. అందరం చివరి గంట ఎప్పుడైపోతుందా అని ఎదురుచూస్తున్నాము. లెక్చరర్ ఏదో—బహుశా 'ఎకనమిక్స్' అయివుండవచ్చు — చెప్పుకుపోతున్నాడు. ఎవరి చెవీ దూరటంలేదు. ఇంతలో మా ప్రిన్సిపాలును చేతిలో ఒక పేపరుతో చూడగానే ఏదో నోటీసనిమాత్రం తెలిసిపోతుంది. ఇట్టే క్లాసులో ప్రవేశించారు. అందరం ఊపిరి బిగబట్టి వినటానికి తయారుగా కూర్చున్నాము. కొంపతీసి రేపు సెలవులేదు స్కూలుకు రమ్మంటాడని మా భయం!

ప్రిన్సిపాలు చెప్పటం ప్రారంభించాడు: "రేపు గాంధీ జయంతని మీకు తెలుసుగదూ? అందువల్ల పూజ్య బాపూజీ జయంతి సందర్భంలో స...సంఘంవారు జరిపే అఖండ సూత్రయజ్ఞంలో మనంకూడ పాల్గొనాలి. రేపు ఉదయం ఏడు గంటలకల్లా మీరంతా యిక్కడ హాజరు కావాలి. నేను మిమ్మల్ని అక్కడకు-అంటే ఆ సూత్రయజ్ఞం జరిగేచోటుకు తీసుకెళతాను" అని చెప్పి వెనక్కు తిరిగిన ప్రిన్సిపాలు, ఏదో మర్చిపోయినవాడిలాగ మా వైపుకు తిరిగి "రేపు అందరూ ఖద్దరు చీరలు కట్టుకొని రావాలి" అన్నాడు.

నా నెత్తిన పిడుగుపడినట్లయింది. వెంటనే "లేనివాళ్ళను ఏమి చేయమంటారండీ?" అన్నాను.

"లేకపోతే సాయంత్రం కొనుక్కోండి లేక అరువు తీసుకోండి. జాతీయ విద్యాలయంలో చదువుతూ ఒక ఖద్దరు చీర లేదని అనటానికి సిగ్గులేదూ?" అన్నాడు చురచుర చూస్తూ.

'హృదయపూర్వకంగా కట్టుకోవాలిగాని, ఒకటి రెండు వుంచుకొని ఏ గాంధీ జయంతికో, ఏ ఆగస్టు పదిహేనుకో కట్టుకోమని గాంధీజీ చెప్పలేదు' అని అందామనిపించింది, కాని ధైర్యం చాలలా.



కథా నిలయం 3902

మా విద్యాలయంలో చాలామంది ఖద్దరు కట్టేవారే. కొంతమందికి కట్టాలని వున్నా అంత ఖరీదు పెట్టలేక కట్టటం మానివేశారు. కాని నేను, సరళ మాత్రం కట్టగలిగినా కట్టటంలేదు. ఈ విషయంలో మాకు ఎప్పుడూ యితర స్టూడెంట్స్‌తో, లెక్చరర్స్‌తో వాదోపవాదాలు జరిగేవి. అదంతా ఇక్కడ చెప్పాలంటే ఒక పేజీ పట్టవచ్చును. ఒక్క మాటలో చెబుతాను: 'ప్రస్తుత మన దేశ దారిద్ర్యాన్ని తొలగించటానికి ఒక ఖద్దరు కట్టటంతో ఏమీ కాదనీ, యింకా ఎన్నో ముఖ్యమైన కార్యా లున్నాయనీ' వాదించే వారిమి.

అందువల్ల మమ్మల్ని మొదటినుండి విద్యార్థులు, ఉపాధ్యాయులుకూడ చెడిపోయినవాళ్లను చూసినట్లు తృణీకార భావంతో చూసేవారు. విద్యార్థులంతా మమ్మల్ని 'నాస్తికు'లంటూ హేళన చేసేవారు. నిజానికి నేను నాస్తికురాలను కాకపోయినా వాళ్ళ సంకుచిత హృదయాలను ఎదుర్కొనబుద్ధి అయేది. 'మీరు ఆస్తికులయి, దేశానికి త్రవ్వి తల కెత్తిందీ, మేము ఎత్తందీ ఏమీలేదు' అంటూ, యింకా యిలాగే ఘర్షణ పడుతుండేవారిమి.

ఏది ఎలావున్నా రేపుమాత్రం ఖద్దరు కట్టాలి. సరళ ఒక ఉపాయం చెప్పింది. వాళ్ళ వదినదగ్గర రెండు మూడు ఖద్దరు చీరెలున్నాయనీ, అందులో ఒకటి నా కిస్తాననీ చెప్పింది. ఎలాగయితేనేమి సమస్య తీరింది.

ఉదయం ఎనిమిది గంటలనుండి ఆ సంఘంవారు ఏర్పాటుచేసిన ఆ పెద్ద భవనంలో అఖండ సూత్రయజ్ఞం ప్రారంభమైంది. జాతీయ గీతాలతో ఆ భవనమంతా దద్దరిల్లిపోతూంది. కొంతమంది చరఖాలూ, కొంతమంది తకిళీలు వడుకుతున్నారు. ఇలాంటి ఏ శుభసమయాల్లోనో తప్ప విప్పని ఆ చరఖాలు, యీ రోజుమాత్రం ఎందుకు పనిచేయాలన్నట్టు 'సమ్మె' ప్రారంభించాయి. అసలే వడకటం సరిగా రాదు. పైగా తుప్పు పట్టివున్న చరఖాలు, ఇక మా అవస్థ అడిగేరూ?

ఆ ప్రొద్దున ఖద్దరుచీర కట్టుకొని బస్సులో వచ్చేప్పుడు నేను ఒక రకమైన నిండుతనాన్నీ, హుందాతనాన్నీ, గర్వాన్నీ అనుభవించ గలిగానని చెప్పటానికి సందేహించను. 'వుఫ్' అనగానే ఎగిరిపోయే ఆ ఉల్లిపొర చీరల్లో యింత నిండుతనం ఎక్కడ వున్నదనుకొన్నాను. ఖద్దరు కట్టటంలో పెద్ద

త్యాగం ఏమీ అవసరంలేదనీ, అందు ప్రాప్తించే ఆత్మతృప్తి - అంటే యితరుల కంటే మనమేదో ఆదర్శాన్ని అంటిపెట్టుకొని జీవిస్తున్నామనే తృప్తి— దొరుకుతుందనీ అనిపించింది. ఏది ఎలావున్నా నేనుమాత్రం ఇకమీదట ఖద్దరు కట్ట నిశ్చయించాను.

నా రాట్నందగ్గర ఏకులు నలిపి కుప్ప కుప్పలుగా పడేశాను. ఒక గంటకల్లా విసుగెత్తింది. కాని అఖండ సూత్రయజ్ఞం కాబట్టి ఆపటానికి వీలు లేదు. సంవత్సరానికి ఒకసారి, రెండుసార్లు చేసే ఆడంబరాన్ని చూసి, నిరాడంబరుడైన బాపూజీ ఆత్మ ఎంత క్షోభిస్తుందోకదా అని ఆలోచింపసాగాను.

ఆరు ఏడు సంవత్సరాల ఇద్దరు కవల పిల్లలు కూడా యీ సూత్రయజ్ఞంలో పాల్గొన్నారు. ఖద్దరు ప్రాకులు వేసుకొని చక్కగా రాట్నాలు వడుకుతుంటే ఎంతో ముచ్చటగా వున్నారు. ఒకరకంగా వాళ్లను చూస్తుంటే రాట్నాలతో మేము పడే అవస్థకు మాకే సిగ్గు కలిగింది. వాళ్ళ తమ్ముడు కాబోలు దాదాపు మూడు సంవత్సరా లుంటాయి. జవ్హార్ కోటూ, ఆ గాంధీ టోపీ ఎంతో ముద్దు వస్తూన్నాడు. ఆ పిల్లలనుచూసి ముద్దుపెట్టుకొని ముచ్చట పడనివారు పాపాత్ములు. వాళ్ల నాన్న బహుశా ఆ సంఘపు శెక్రటరీ కావచ్చు, చాలా హడావుడిగా పని చేస్తున్నాడు. నిజంగా గాంధీగారి అడుగుజాడుగుల్లో నడుస్తూ, కుటుంబాన్ని మొత్తం నడిపిస్తున్న ఆయన్ను అందరూ అనుకరిస్తే ఎంత బావుండు ననిపించింది.

పన్నెండు గంటలయింది. కడుపులో ఎలుకలు పరిగెత్త సాగాయి. 'భూఖే పేట్ భజన్ నహోయ్ గోపాల్', 'ఓ భగవంతుడా, ఆకలిపొట్టతో భజన జరగదు' అన్న హిందీ సామెత జ్ఞాపకం వచ్చింది. రాట్నాల శబ్దం మందగిస్తూన్నది. యింతలో కొంతమంది వాలంటీర్లు మా రాట్నాలముందు కూర్చుని మాకు విముక్తిని కలిగించారు.

మధ్యాహ్నం చరఖా పోటీ తరువాత ఆరు గంటలకు గవర్నరుగారి ఉపన్యాసంతో ముగుస్తుంది, ఈ అఖండ సూత్రయజ్ఞం. అందువల్ల మమ్మల్ని అంతవరకూ వుండమని ప్రాధేయపడుతూ, ఆ సెక్రటరీగారు మాకు భోజనం ఏర్పాట్లు చేశారు. అందరం ఆ ప్రక్కనేవున్న హోటల్‌కు బయలుదేరాము. రాగానే ఫొటో తీస్తారట, అందువల్ల మమ్మల్ని త్వరగా రమ్మని చెప్పారు.

సరళ, నేను ఏదో మాట్లాడుకుంటూ వెనక నడుస్తున్నాము. ఆ భవనం మెట్లు దిగగానే దేన్నో చూసి సరళ ఠక్కున ఆగిపోయింది, నా దృష్టికూడా ఆ దృశ్యంమీద పడగానే ముందు జుగుప్స, మరల ఏదో బాధా కలిగింది.

ఇద్దరు పిల్లలు. ఒకనికి దాదాపు ఏడు సంవత్సరా లుంటాయి. రెండో వానికి నాలు గుండవచ్చును. చీకిపారేసిన తాటిగింజలాగ పిడచకట్టుకొని వున్న సంస్కారంలేని జుట్టూ, పుల్లల్లాగ ఎండియున్న కాళ్ళూ, చేతులూ, ఏది వున్నా లేకపోయినా నేనుమాత్రం తప్పనంటూ తన అస్తిత్వాన్ని తెలియపరుస్తున్న ఆ ముందుకు వచ్చివున్న పెద్ద పొట్టా, ఆ పెద్ద తలలూ, ప్రపంచంలోని కురూపితనాన్నీ, దారిద్ర్యాన్ని పోగుచేసుకున్నట్టున్నాయి. ఇలాంటి రూపాలు ప్రతిరోజూ బస్ స్టాండుల్లో, పేవ్ మెంట్లమీద కన్పించేవేగా? యిందులో అంతగా చెప్పాల్సిన విషయ మేముందంటున్నారు గదూ?

అవును, అలాంటి రూపాల్ని అనుదినం చూడటం, చూసి జాలిపడటం, ఏదో చేయాలని వున్నా చేయలేకపోవటంవల్ల బాధ పడటం, చివరికి ఎలాగో ఒకలాగ 'ఎవరి కర్మకు ఎవరుకర్త' 'ఎంతమందికి ఏదైనా చెయ్యగల'మని సరిపెట్టుకొని తృప్తిపడటం సర్వసాధారణం అయిపోయింది.

ఆ పిల్లలిద్దరూ ఒక కాలుకిందకు రెండవకాలు పైకి మడుచుకొని పక్కపక్కనే కూర్చొని వున్నారు. మోకాళ్ళమీద గడ్డాలను ఆన్చి, మోకాళ్ళ నుండి చీలమండల వరకూ కుతపల కుతిపలగా కారుతున్న చీము, రక్తంమీద ముసురుకొంటున్న యీగల్ని తోలుకుంటూ, పసిపిల్లల సహజమైన అమాయకపు చూపులతో, వచ్చేపోయేవాళ్ళను ఆనగా చూస్తున్నారు.

'మేము అక్కడే నిలబడటంవల్ల తతిమ్మా స్టూడెంట్సు దూరంగా పోయి నిల్చొని భోజనానికి రమ్మని తొందరచేయటం ప్రారంభించారు. అవునుమరి, ఆలస్యంగా వెళ్ళితే ఫొటో తీసేస్తే ఎలా? పేపర్లో కూడా తప్పకవేస్తారాయె! నిజంగా చెప్పాలంటే నాకు భలే కోపం వచ్చింది. మీ వుదార హృదయాలూ, ఉన్నతమైన ఆశయాలూ ఎక్కడికి పోయాయని అడగాలనిపించింది. కాని, అనలేదు. 'మీరు వెళ్ళి భోజనం చేయండి, మేము తరవాత వస్తామని చెప్పి, సరళ నేనూ, ఆ పిల్లలకాదు...కాదు ... పిల్లల రూపంలో కుళ్ళిపోతున్న మానవత్వం దగ్గరకు వెళ్ళి నిలబడ్డాము. ముంజూ కంపు! ముక్కుళ్ళు బద్దలవుతున్నాయి!

యిద్దరు ఒక్కసారిగా ముఖాలు పైకెత్తి మా వంక ఆశ్చర్యంతో చూస్తున్నారు. చిన్నారి పాపల చిందులాడే చిరునవ్వు లేదు. ఆ కళ్ళలో పసి పాపల అమాయకపు చూపుల అమరత్వం లేదు. ఆ ముఖాల్లో లేత హృదయాల బోసినవ్వులు లేవు. మరి ఏమున్నదంటున్నారా? ఏమో ఏమున్నదో చెప్పటానికి నాచేత కావటంలేదు. కాని ఒకటి మాత్రం చెప్పక తప్పదు. ఆ గుంటలలోనుండి తొంగిచూసే కళ్ళు మానవత్వాన్నే అనుమానించే ఆ కళ్ళు-మమ్మల్ని ఏదో ప్రశ్నిస్తున్నాయి!

బహుశా అవి మమ్మల్ని అడుగుతున్నాయి. 'మీ సమాజం...మీ దేశం...మీ సేవాపరాయణత...మీ ఖద్దరు మీ అహింస, మీ విజ్ఞానం మాకేమిచ్చాయి?' అని.

"మీ అమ్మ ఏమయిందిరా?" అని అడుగుతున్న సరళ ప్రశ్నకు ఈ ప్రపంచంలోకి వచ్చాను నా ఆలోచనలనుండి.

"ఆఁ, ఏమవుతుంది? తిండి దొరక్క తన శరీరాన్ని తనే తింటూ చివరకు హరించుకొనిపోయి వుంటుంది" అని అనుకున్నాను మనస్సులో.

"చచ్చిపోయింది" అన్నాడు చిన్నవాడు ఒకరకంగా నవ్వుతూ!

"మరి, మీ అయ్యో?"

"జైల్లో వుండాడు" అన్నాడు పెద్దవాడు.

"ఎందుకు?" అన్నది సరళ.

"ఎందుకేమిటి? జానెడుపొట్ట నింపుకోటానికి ఏ పెట్టిపుట్టిన మారాజు యింట్లోనో రొట్టెముక్క దొంగిలించి వుంటాడు" అన్నాను నేను.

"కాదు మా అమ్మను చంపాడు" అన్న వాడి మాటలకు వులిక్కిపడ్డాను.

సరళ ఒక నిట్టూర్పు విడిచి అన్నది: "నేను మొదటినుండి అనుకుంటూనే వున్నా. ఎప్పుడో దానికి వాడిచేతిలోనే రాసిపెట్టి వున్నదని."

నా ఆశ్చర్యానికి అంతులేదు. సరళ ఏదో ప్రశ్నలు వేస్తున్నదనుకొన్నాను. కాని ఆమెకు వీళ్ళు తెలుసు ననుకోలేదు.

సరళ చెప్పటం ప్రారంభించింది—

"వీళ్ళ అమ్మ మా యింట్లో పనిచేస్తూ వుండేది. చూడు, వీడి కళ్ళు ఎంత అందంగా వున్నాయో ? అచ్చంగా వాళ్ళ అమ్మలానే"

"సరేలే అసలు విషయం చెప్పు. కూడూ, గుడ్డా అన్నీ వున్నవాళ్లకు అందం, వీళ్ళకు అంద మేమిటి ?" అని విసుక్కున్నాను.

"వీళ్ళ అమ్మ మూగది. వీళ్ళనాన్న సోమరి. పనిచేసేవాడు కాదు. పైగా దాన్ని రోజూ అది కావాలి, యిది కావాలి అంటూ చంపుకు తినే వాడు. దానికి పిల్లలన్నా, ఆ మొగుడన్నా ఎంత ప్రేమ! ఏది అంత చేతులో పెట్టినా మొగుడికీ పిల్లలకూ పెట్టందే చస్తే నోట్లో వేసుకొనేది కాదు. పోయిన సంవత్సరం వేసవి శెలవల్లో యిల్లు తాళంవేసి మావూరు వెళ్ళి పోయాము. తిరిగి వచ్చిం తర్వాత అది మరల కన్పించనే లేదు. మేము ఆమెను గురించి అసలు ఆలోచించను కూడా లేదనుకో. వేరే పనిమనిషి కన్పించికపోతే గదా ఆలోచించటానికి. ఆ మొగుడి దెబ్బలతోనే చచ్చిపోయి వుంటుంది. రాక్షస ముండాకొడుకు," అని చెబుతున్న సరళకళ్ళల్లో నీరు తిరిగింది.

"ఆకలిగొన్నవాడు ఎండుపుల్లలాగ మండుతాడు" అని వూరకనే అన్నారా పెద్దలు ? తమ ఈ ఆకలికి, దురవస్థకూ, కారణమేదో ఆ అజ్ఞానుల కేమి తెలును ? తెలుసుకోటానికి అవకాశం ఎక్కడ వున్నది ? తమ అసంతృప్త హృదయాలకు తమతోపాటే, పాటుబడే అభాగ్యులను ఎరచేస్తుంటారు," అంటూ వుద్రేకంతో మాట్లాడుతున్న నా భుజంమీద కొడుతూ సరళ అన్నది—

"సరేలే, వాళ్ళకేదయినా యిచ్చి వెళ్ళిపోదాం పద. మరల మన వాళ్ళంతా వచ్చే వేళయింది. మనల్ని యింకా యిక్కడే చూస్తే ఎగతాళి చేస్తారు."

నేను సరళ మాటలు వినిపించుకోకుండానే పెద్దవాడిని అడిగాను— "ఏమిరా, జనరల్ హాస్పిటల్‌కు పోకూడదూ ?" అని.

వాడు అన్నాడు "వెళ్ళాము. మమ్మల్ని ఎవరూ చూడలేదు. బయటకు వెళ్ళగొట్టారు" అని.

"పేరు ధర్మాస్పత్రిఅయితే మాత్రం ఆడ్డమైన దిక్కులేనివాళ్లను చేర్చుకోవాలని ఎక్కడ వున్నది?" సరళ వ్యంగ్యంగా అన్నది.

"నేను తీసుకెళతాను వస్తారా?" అన్నాను నేను. యిద్దరూ ఒకే సారిగా విప్పారిన ముఖాలతో—

"ఆ" అన్నారు.

పాపం, ఎంత బాధగావుండి అంత ఆదుర్దాగా "ఆ" అన్నారో? తల్చుకుంటే ఈ రోజుకూ నా కడుపు తరుక్కుపోతుంది.

దూరంనుండే మా వాళ్ళు రావటం చూసి, వెంటనే పర్సులో ఒక రూపాయితీసి పెద్దవాడి చేతిలో పెట్టి అన్నాను—

"యిది తీసుకెళ్ళి ఏమయినా కొనుక్కు తినండి. రేపు నేను హాస్పటలకు తీసుకెళతాను" అంటూ సరళ, నేను అక్కడ నుండి ముందుకు సాగాము.

ఇంతలో వెనుక నుండి ఏవో కేకలు వినిపించాయి. తిరిగి చూశాను. ఆయనే, ఆ పిల్లల, అంటే ముందు చెప్పాను. చూడండీ, ముచ్చటగా ఖద్దరు ఫ్రాకులు వేసుకొని రాట్నాలు వడికేారని, వాళ్ల తండ్రి, వీళ్లను దూరంగా పొమ్మని కేకలు వేస్తున్నాడు. ముఖం చిట్లించుకుంటూ, ముక్కు మూసుకొని, రౌద్రరూపంతో వాళ్ళను కొట్టబోతున్న ఈ మహాశయుడేనా, యీ రోజు సూత్రయజ్ఞ సరంజామా అంతా చేస్తున్నది? అనిపించింది.

"బాపూజీ ఆత్మ అక్కడ, ఆ రాట్నాల మధ్య వుంటుందా లేక ఈ అనాధ బాలల మధ్య వుంటుందా? ఈ ఆడంబరాలనూ, మిధ్యా ఆదర్శాలనూ చూసి బాపూజీ ఆత్మ తృప్తిపడుతుందా?" అని ఆలోచించసాగాను.

ఆయన గర్జవలకు ఆ పిల్లలిద్దరూ పరుగెత్తారు. వెళుతూ వెళుతూ మమ్మల్ని ఒక్కసారి ఆప్యాయంగా చూస్తూ, నవ్వుతూ పారిపోయారు.

నా మనస్సు, జరిగే సూత్రయజ్ఞంలో కానీ, పాటల్లో కానీ లగ్నం కావటంలేదు. వంట్లో బాగాలేదని మా ప్రిన్సిపాలుతో చెప్పి యింటికి వచ్చేశాను.

ఆ రోజంతా బాధపడ్డాను. రెండవరోజు మరల మామూలే! ఎన్నో పనుల్లో వాళ్ళ నెప్పుడో సరళ గుర్తు చేసింది.

"వాళ్ళు ఎక్కడ వుంటారని వెతకటం యిన్ని రోజుల తరువాత ?" అన్నాను.

"అక్కడ ఎవర్నయినా అడిగితే చెప్పరా ?" అన్నది సరళ.

సరళ అమాయకత్వానికి నవ్వు వచ్చింది. "పిచ్చిదానా, ఎవరినైనా, పోయి మొన్న యిక్కడ కొన్ని చిత్తుకాగితాలూ, చెత్తపరకలూ వుండాలి. ఏమయినాయి ? అని అడిగితే ఏమంటారు ? మనలను పిచ్చి ఆసుపత్రికి పంపుతారు కూడా! వీళ్ళ జీవితాలూ ఆ చిత్తుకాగితాలూ, చెత్తపరకలకూ పోలి నవే. వాళ్లు ఏమయితే ఎవరికి కావాలి ? కొద్దిరోజులు అలాగే క్రుళ్లుతూ జీవిస్తారు. ఆ ప్రాణంకాస్తా పోయాక 'చిత్తు కాగితాలూ, చెత్త పరకల'తో పాటు ఏ పాకీవాడో నిర్వికారంగా వూడ్చేస్తాడు. అంతే" అన్నాను.

కాని ఆ పసివాని కళ్లుమాత్రం నన్ను ఈ రోజుకూ ప్రశ్నిస్తుంటాయి : "మీ దేశం, మీ సమాజం, మీ స్వతంత్రం, మీ విజ్ఞానం, మీ ఆదర్శాలూ మాకేమి యిచ్చాయి" అంటూ.

(ఆంధ్రప్రభ వారపత్రిక 5 " 54)